
సాక్షి
బాపట్ల
శుక్రవారం । 11 । జూలై । 2025



అష్టలక్ష్మి అమ్మవారికి సారె సమర్పణ

నరసరావుపేట ఈస్ట్: ఆషాఢ మాసం నేపథ్యంలో ఎన్జీఓ కాలనీలోని శ్రీ అష్టలక్ష్మి అమ్మవారికి గురువారం మహిళలు ఊరేగింపుగా వచ్చి సారె సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు.



పోలేరమ్మకు కూరగాయల అలంకరణ

యడ్లపాడు: మండలంలోని బోయపాలెం వాల్మీకినగర్‌లోని గ్రామ దేవత శ్రీపోలేరమ్మ గురువారం శాకంబరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

ఆదికేశవ స్వామికి గరుడ సేవ



చేబ్రోలు: స్థానిక శ్రీ భూనీలా సమేత ఆదికేశవ స్వామి వారి ఆలయంలో గురువారం రాత్రి పున్నమి గరుడ సేవ ఘనంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ప్రభుత్వ సదుపాయాలు సద్వినియోగం చేసుకోండి



మేదరమెట్ల: విద్యార్థులకు ప్రభుత్వం అందించే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం మేదరమెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం తల్లిదండ్రులు–ఉపాధ్యాయుల సమావేశం (పీటీఎం) జరిగింది. కార్యక్రమంలో భాగంగా పాఠశాలలోని 452 మంది విద్యార్థినులకు సైకిళ్లను అందజేశారు. కలెక్టర్ వెంకట మురళి, తహసీల్దార్ సుబ్బారెడ్డి, ఎంపీడీఓ రాజ్యలక్ష్మి, ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి, మన్నె రామారావు, మేదరమెట్ల శ్రీనివాసరావు, మండల నాయకులు పాల్గొన్నారు.

పెరుగుతున్న సాగర్ నీటిమట్టం

విజయపురి సౌత్: నాగార్జునసాగర్ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. గురువారం సాయంత్రం ఆరు గంటలకు 541.20 అడుగులకు చేరింది. కాగా, ఇది 190.8366 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 4,204, ఎడమ కాలువకు 3,202, ఎస్ఎల్‌బీసీకి 1,500 క్యూసెక్కులు విడుదల అవుతోంది. సాగర్ జలాశయం నుంచి మొత్తం 8,906 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 1,16,833 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

కందులు కొనుగోలు చేయండి



నరసరావుపేట: కందుల ధరలు తగ్గుతున్న నేపథ్యంలో జిల్లా రైతుల నుంచి కొనుగోలు చేయాలని దాల్ మిల్లర్లను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు కోరారు. గురువారం కలెక్టరేట్‌లో దాల్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. వినుకొండ, దాచేపల్లి మండలాల్లో రైతుల వద్ద ఉన్న కందులను మెరుగైన ధరకు కొనాలన్నారు. ఈ వారంలోగా ధరను మిల్లర్స్ అసోసియేషన్ ద్వారా నిర్ణయించి కొనుగోళ్లు ప్రారంభించాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, జిల్లా వ్యవసాయ అధికారి జె.జగ్గారావు, ఆర్డీవోలు కె.మధులత, రమణాకాంత్‌రెడ్డి, మురళీకృష్ణ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు బకాయిల చెల్లింపు పూర్తి

నరసరావుపేట: జిల్లాలో గురువారం ధాన్యం కొనుగోలు బకాయిల్లో రూ.6.29 కోట్లు చెల్లింపులు ప్రధాన కార్యాలయ నుంచి రైతుల అకౌంట్లకు జమ చేశామని, దీంతో మొత్తం బకాయిలు రూ.11.36 కోట్ల చెల్లింపులు పూర్తి చేసినట్లు జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే వెల్లడించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 2024–25 రబీ సీజన్‌లో 68 రైతు సేవా కేంద్రాల ఆధ్వర్యంలో 37 కొనుగోలు కేంద్రాల ద్వారా 550 మంది రైతుల నుంచి రూ.11.36 కోట్ల విలువైన 4,904 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామన్నారు. ఈ ఏడాది జూన్ 30 వరకు రూ.4.07 కోట్లు చెల్లింపులు జరిగాయన్నారు. జూలై ఒకటో తేదీన మరో రూ. కోటి రైతుల అకౌంట్లకు వేశామన్నారు.

నాణ్యతతో కూడిన విద్యుత్ సరఫరాకు చర్యలు

ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి



నరసరావుపేట: నాణ్యతతో కూడిన విద్యుత్ సరఫరా చేసేందుకు తగిన చర్యలు చేపట్టినట్లు ఏపీసీపీడీసీఎల్ సీఎండీ డి.పుల్లారెడ్డి చెప్పారు. గురువారం ఆయన బరంపేట విద్యుత్ కార్యాలయంలో పల్నాడు జిల్లా సర్కిల్‌పై సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆర్‌డీఎస్ఎస్ పనులు, రెవెన్యూ కలెక్షన్లు పెంపుదల, పీఎం సూర్య ఘర్‌లపై సమీక్ష చేసి లక్ష్యాలు నిర్దేశించామన్నారు. వ్యవసాయ పంపు సెంట్ల కనెక్షన్ల కోసం సుమారు రెండు వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వచ్చే మూడు నెలల వ్యవధిలో ఆ సర్వీసులు అందజేయాలని అధికారులను ఆదేశించామన్నారు. లో ఓల్టేజ్, అధిక లోడులు ఉన్న ప్రాంతాల్లో బేస్‌మెంట్లు వేసి అధిక ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా విద్యుత్ శాఖ అధికారి పి.విజయకుమార్, ఈఈ సీహెచ్ రాంబొట్లు పాల్గొన్నారు.

చౌకగా నొక్కి... భారీగా బొక్కి..!

- పేదల రేషన్ బియ్యానికి బదులు నగదు పంపిణీ
- బియ్యం అడిగితే కార్డు రద్దు చేస్తామని డీలర్ల బెదిరింపులు
- కార్డుదారులకు కిలోకు రూ.10 నుంచి రూ.14 వరకు చెల్లింపు
- ఒక్కో నియోజకవర్గ పచ్చ నేతకు నెలకు రూ. 30 లక్షలు కప్పం
- జిల్లా స్థాయి అధికారులకూ నెలవారీగా అందుతున్న మామూళ్లు
- రేషన్ బియ్యం యథేచ్ఛగా సరిహద్దు దాటుతున్నా చర్యలు శూన్యం

పేదలను వదలని రేషన్ బియ్యం మాఫియా, పచ్చ నేతలు

పేదల కడుపు నింపాల్సిన చౌక బియ్యాన్ని అడ్డగోలు సంపాదన కోసం పచ్చ నేతలు విక్రయానికి పెడుతున్నారు. కార్డుదారులకు చేరకుండానే రేషన్ మాఫియాకు బియ్యాన్ని అప్పగిస్తున్నారు. ఇందుకోసం ఒక్కో నియోజకవర్గ పచ్చ నేత మాఫియా నుంచి నెలకు అక్షరాలా రూ. 30 లక్షల వరకు కప్పం కట్టించుకుంటున్నారు.



సాక్షి ప్రతినిధి, బాపట్ల: చౌక దుకాణం డీలర్‌కు మాఫియా కిలోకు రూ. 5కు తగ్గకుండా కమీషన్ చెల్లిస్తోంది. మరోవైపు బియ్యాన్ని కార్డుదారులకు చేరుస్తున్నారని ప్రభుత్వం డీలర్లకు కిలోకు రూపాయి కమీషన్ ఇస్తోంది. క్షేత్రస్థాయిలో మాత్రం డీలర్లు, ఆయా నియోజకవర్గ పచ్చ నేతలు కలిసి పేదల కడుపు కొడుతున్నారు. మాఫియాకు బియ్యం అప్పగిస్తుండగా, వారు డిమాండ్‌ను బట్టి కొంత బియ్యాన్ని మిల్లులకు విక్రయిస్తున్నారు. మిగిలిన బియ్యాన్ని జిల్లా సరిహద్దులు దాటించి తర్వాత విదేశాలకు అక్రమ రవాణా చేస్తున్నారు.

కొందరికే నగదు చెల్లింపు

తెల్ల రేషన్ కార్డుదారులకు చౌక బియ్యం ఇవ్వకుండా పచ్చ నేతలు, రేషన్ మాఫియా కలిసి బెదిరింపులకు పాల్పడుతోంది. కొందరికి మాత్రమే నగదు ఇస్తోంది. కిలోకు ఇంతని నగదు చెల్లిస్తున్నారు. జిల్లాలోని అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లో కిలోకు రూ.14 ఇస్తున్నారు. చీరాల, రేపల్లె ప్రాంతాల్లో రూ. 10, వేమూరు నియోజకవర్గంలో రూ.11, బాపట్ల నియోజకవర్గంలో రూ.12 చొప్పున ఇస్తున్నారు. చాలాచోట్ల కొందరికి సక్రమంగా ఇవ్వడం లేదు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సానుభూతిపరులుగా భావిస్తున్న కార్డుదారులకు డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు. దీనిపై ప్రశ్నిస్తే వచ్చే నెల నుంచి అసలు కార్డే లేకుండా చేస్తామని పచ్చ నేతలు, డీలర్లు బెదిరిస్తున్నారు.

చీరాల, అద్దంకి, పర్చూరు, రేపల్లె ప్రాంతాల్లో ఈ దుస్థితి ఉంది.

పోర్టుల ద్వారా విదేశాలకు..

కొందరు రైస్ మిల్లర్లకు మాఫియా బియ్యం విక్రయిస్తోంది. మిగిలిన బియ్యాన్ని కృష్ణపట్నం, కాకినాడ, చెన్నై పోర్టుల నుంచి ఎగుమతి చేస్తోంది. రోడ్డు మార్గాన కూడా గుజరాత్‌కు తరలిస్తోంది. అక్కడి నుంచి దక్షిణాఫ్రికా తదితర దేశాలకు అక్రమార్కులు రవాణా చేస్తున్నారు. మిల్లర్లు రీ సైక్లింగ్ చేసి అధిక ధరకు విక్రయిస్తూ ప్రజలను దోచుకుంటున్నారు. ప్రకాశం జిల్లాతో పాటు అద్దంకి, పర్చూరు ప్రాంతాలకు చెందిన పచ్చ పార్టీ కీలక నేతలు బియ్యం మాఫియాను నడిపిస్తున్నారు.

అధికారుల అండదండలు

ఈ అక్రమాలను అడ్డుకోవాల్సిన అధికారులు కూడా మాఫియా వద్ద నెలవారీ మామూళ్లు తీసుకుని సహకరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నియోజకవర్గ పచ్చ నేతకు నెలకు రూ. 30 లక్షలు చొప్పున చెల్లిస్తున్న మాఫియా... డీలర్ల కమీషన్‌తోపాటు పౌర సరఫరాల శాఖకు చెందిన అధికారికి నెలకు రూ. రెండు లక్షలు, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతోపాటు స్థానిక సివిల్ సీఐ, ఎస్ఐలకు సైతం నెలకు ఒక్కొక్కరికి రూ. 70 వేల నుంచి రూ. 10 వేల వరకూ చెల్లిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ లెక్కన ఒక్కో నియోజకవర్గంలో నెలకు రూ. 35 లక్షల వరకు మాఫియా ఖర్చు పెడుతోంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన మొదటి రోజుల్లో ఓ నియోజకవర్గ పచ్చ నేతకు నెలకు రూ. 12 లక్షలు కప్పం చెల్లించారు. మొదటి మూడు నెలల్లోనే ఆ మొత్తాన్ని ఏకంగా రూ. 25 లక్షలకు పెంచారు. ఇప్పుడు రూ. 30 లక్షల వరకు వసూలు చేస్తుండటం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. భారీగా లాభాలు వస్తుండటం వల్లే ఇంత మొత్తం వెచ్చిస్తున్నట్లు తెలుస్తోంది. అన్ని ఖర్చులతో కిలో బియ్యాన్ని రూ. 25 లోపే సేకరిస్తున్న మాఫియా... తర్వాత కిలో రూ. 70 నుంచి రూ.80 వరకు ధర నిర్ణయించి, భారీగా విక్రయించి సొమ్ము చేసుకుంటోంది.

ఎకరాకు రూ.18 లక్షల చొప్పున పరిహారం

ఆర్ఈఎంజెడ్ కోసం భూములిచ్చే రైతులతో కలెక్టర్

బాపట్ల: అద్దంకి నియోజకవర్గంలో రెన్యువబుల్ ఎనర్జీ మ్యానుఫ్యాక్చరింగ్ జోన్ (ఆర్ఈఎంజెడ్) స్థాపనకు అవసరమైన భూమి కొనుగోలుకు ఎకరాకు రూ.18 లక్షలు చెల్లించాలని నిర్ణయించినట్లు జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాల్లో రైతులతో ఆయన జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లో ఆర్ఈఎంజెడ్ ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదించిందని గుర్తుచేశారు. బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లోని కుందూరు, మామిళ్ళపల్లి, మక్కినవారి పాలెం, గుడిపాడు గ్రామాలలో భూమి కొనుగోలుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని తెలిపారు. దాదాపు 1,800 ఎకరాల కొనుగోలుకు నిర్ణయించినట్లు చెప్పారు. రైతులు ఎకరాకు రూ. 20 లక్షలు ఇవ్వాలని కోరారని తెలిపారు. ల్యాండ్ ఎక్విజేషన్ నిబంధన మేరకు మాత్రమే కొనుగోలు చేయడానికి అవకాశం ఉందని చెప్పారు. జోన్ ఏర్పాటుతో స్థానికంగా పారిశ్రామిక అభివృద్ధి సాధ్యం అవుతుందని అన్నారు. దాదాపు 2,500 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని వివరించారు. స్థానికుల్లో అర్హులైన వారికి ముందుగా అవకాశం కల్పిస్తారని తెలిపారు. నిబంధన మేరకు ఎకరాకు రూ.18 లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. దీనికి రైతులందరూ అంగీకరించారు. ఈ కార్యక్రమంలో చీరాల రెవెన్యూ డివిజన్ అధికారి చంద్రశేఖర్, ఉప కలెక్టర్ లవన్న, బల్లికురవ మండల రెవెన్యూ అధికారి ఎం.రవినాయక్, సంతమాగులూరు మండల రెవెన్యూ అధికారి కె.రవిబాబు, జోన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శివ శంకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

ఎస్ఎంఆర్‌ల వేతనాలు పెంపు

ప్రభుత్వ శాఖల్లో వివిధ విభాగాలలో పనిచేస్తున్న ఎస్ఎంఆర్‌ల రోజు వారీ వేతనాన్ని వీడీఏ పాయింట్ల ఆధారంగా పెంచినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోని వీక్షణ సమావేశ మందిరంలో ఆయన జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. పలు శాఖల్లో పనిచేస్తున్న ఎస్ఎంఆర్‌ల రోజువారీ వేతనాలను సవరించినట్లు తెలిపారు. అత్యంత నైపుణ్యం గల వారికి రూ.900 ఉండగా, ఇప్పుడు రూ.937గా మార్చినట్లు వివరించారు. నైపుణ్యం గల వారికి రూ.850 ఇస్తుండగా ఇప్పుడు రూ. 885కి, సెమీ స్కిల్డ్ వారికి రూ.750 ఇస్తుండగా.. రూ.781కి, నైపుణ్యం లేని వారికి ప్రస్తుతం రూ.650 ఇస్తుండగా రూ.677కి పెంచినట్లు తెలిపారు. ఈ వేతనాలు వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు వర్తిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ వెంకట శివప్రసాద్, కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేసిన రిసార్టులపై చర్యలు

చీరాల టౌన్: చీరాల తీర ప్రాంతాల్లో సీఆర్‌జెడ్ నిబంధనలు అతిక్రమించి అక్రమంగా నిర్మాణాలు చేసిన రిసార్ట్స్‌పై చర్యలు తప్పవని చీరాల ఆర్డీఓ తూమాటి చంద్రశేఖర నాయుడు స్పష్టం చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం జిల్లా డీపీవో ప్రభాకరరావు, పొల్యూషన్ కంట్రోల్ ఈఈ రాఘవ రెడ్డిలతో కలిసి వాడరేవు, రామాపురం, విజయలక్ష్మీపురం, కఠారిపాలెం తదితర ప్రాంతాల్లో పర్యటించారు. నిబంధనలను అతిక్రమించి నిర్మాణాలు చేపట్టిన పలు రిసార్ట్సులను పరిశీలించారు. సముద్ర మట్టానికి దగ్గరగా నిర్మాణాలు చేసిన రిసార్ట్సు వివరాలను సేకరించి కొలతలు తీసుకున్నారు.



రిసార్టు వద్ద కొలతలు తీయిస్తున్న ఆర్డీవో, డీపీఓ, పొల్యూషన్ కంట్రోల్ ఈఈ తదితరులు

నిబంధనలు విస్మరించి అక్రమ కట్టడాలు చేసిన పలువురు నిర్వాహకులకు నోటీసులు అందించారు. రెవెన్యూ, పంచాయతీ రాజ్ అధికారులు, సర్వేయర్లు పాల్గొన్నారు.

కోన ప్రభాకరరావు విగ్రహం ఏర్పాటుకు డిమాండ్

బాపట్ల: జాతీయ స్థాయి రాజకీయాల్లో సైతం ప్రత్యేకత చాటుకున్న దివంగత కోన ప్రభాకరరావు విగ్రహాన్ని బాపట్ల పాత బస్టాండ్ డివైడర్‌పై తిరిగి ప్రతిష్ఠించాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి డిమాండ్ చేశారు. గురువారం కోన ప్రభాకర రావు 109వ జయంతి సందర్భంగా కోన రఘుపతి ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్ సెంటర్లో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రఘుపతి మాట్లాడుతూ.. కోన ప్రభాకర రావు బాపట్లకు చేసిన సేవలు స్మరించుకునేలా విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలు స్ఫూర్తిని పొందేలా చూడాలన్నారు. రహదారి విస్తరణలో భాగంగా తొలగించిన విగ్రహాలను తిరిగి అక్కడే ఏర్పాటు చేస్తామని చెప్పిన మున్సిపల్ అధికారులు ఇప్పుడు మాట తప్పారని పేర్కొన్నారు. ఈ విషయంలో ఎందుకు రాజకీయం చేస్తున్నారని ప్రశ్నించారు. ఎన్టీఆర్, గుర్రం జాషువా, పొట్టి శ్రీరాములు విగ్రహాలను కూడా తిరిగి ప్రతిష్ఠించాలని కోరారు. పురపాలక సంఘం ఆమోదించిన తీర్మానం ఇప్పటికైనా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్ బాబు, మండల పార్టీ అధ్యక్షుడు మరుప్రోలు ఏడుకొండల రెడ్డి, చేజర్ల నారాయణ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, యువజన నాయకులు కోకిలగడ్డ చెంచయ్య, డి.జయభారత్ రెడ్డి, పార్టీ మున్సిపల్ విభాగం నాయకుడు షేక్ సయ్యద్ పీర్, బులిరెడ్డి, ఉయ్యూరు లీలా శ్రీనివాసరెడ్డి, జోగి రాజా, ఇనగలూరి మాల్యాద్రి, షోహిత్, ఉరబిండి గోపి, గొర్రుముచ్చు పుష్పరాజ్యం, వేల్పుల మీరాబీ, మునీర్, కోకి రాఘవరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు చల్లా రామయ్య ఆధ్వర్యంలో చేతి కర్రలను పంపిణీ చేశారు.



పాతబస్టాండ్ వద్ద రోడ్డుపై ధర్నా చేపట్టిన కోన రఘుపతి తదితరులు

చీరాల 'చైర్మన్'పై గందరగోళం

చీరాలలో చైర్మన్ ఎవరనే విషయంలో గందరగోళం నెలకొంది. ఎమ్మెల్యే ఎటూ తేల్చకపోవడంతో టీడీపీ నేతలు ఆశగా ఎదురుచూస్తున్నారు. పదవి ఆశిస్తున్న వారి సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. కౌన్సిలర్లను మంచిగా 'చూసుకునే' వారికే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.



చీరాల మున్సిపల్ కార్యాలయం

- చీరాల మున్సిపల్ చైర్మన్ పదవిపై ఎటూ తేల్చని ఎమ్మెల్యే
- రోజు రోజుకూ పెరిగిపోతున్న ఆశావహుల జాబితా
- కౌన్సిలర్లకు డబ్బులిచ్చి మద్దతు పొందే వారికే ప్రాధాన్యత

చీరాల: ఎమ్మెల్యే రంగంలోకి దిగడంతో అవిశ్వాస తీర్మానం నెగ్గినా కొత్త చైర్మన్ ఎంపిక కత్తి మీద సాములా మారింది. కుల సమీకరణలు, ఆదాయ వనరులను బట్టి ఎక్కువ మొత్తం వెచ్చించిన వారికే దక్కే అవకాశం ఉంది. ఇప్పటికే క్యాంపు ఏర్పాటు, విశాఖపట్నం, పాపికొండల టూర్ అంటూ సుమారు రూ.50 లక్షల వరకు ఖర్చు చేసినట్లు సమాచారం. కేవలం ఎనిమిది నెలలు మాత్రమే పదవీ కాలం ఉండడంతో డబ్బు ఖర్చు పెట్టేందుకు మరికొందరు సంశయిస్తున్నారు. చైర్మన్ పదవిపై మోజు ఉన్నవారు మాత్రం తహతహలాడుతున్నారు. ఈ నెల 16న జరిగే ఎన్నికలో చైర్మన్ ఎవరనేది తేలనుంది.

'అవిశ్వాసం'తో వేటు

చీరాల మున్సిపాలిటీలో నాలుగు సంవత్సరాల పాటు చైర్మన్‌గా పనిచేసిన జంజనం శ్రీనివాసరావుపై కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు గతంలో ముందుకొచ్చారు. టీడీపీ మద్దతు కౌన్సిలర్లతోపాటు ఆమంచి వర్గానికి చెందిన కౌన్సిలర్లు మొత్తం 22 మంది సంతకాలు చేసిన వినతిపత్రాన్ని ఏప్రిల్ 23న కలెక్టర్ జె.వెంకట మురళికి 17 మంది సభ్యులు అందించారు. మాజీ ఎమ్మెల్యే ఆమంచి వర్గానికి చెందిన ఐదుగురు కౌన్సిలర్లు కూడా టీడీపీకి మద్దతు పలికారు. దీంతో మే 14న కౌన్సిలర్లు, ఇద్దరు ఎక్స్అఫీషియోలతో కలిపి 26 మంది పాల్గొని అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటు వేశారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను తమ వైపునకు తిప్పుకొని క్యాంపుల పేరు ఇతర ప్రాంతాలకు పంపించారు. చైర్మన్ సీటును ఆశిస్తున్న వారు మిగిలిన కౌన్సిలర్లకు సకల రాజమర్యాదలు చేసి అవిశ్వాస ఓటింగ్ నాటికి తిరిగి చీరాలకు తీసుకువచ్చారు. అవిశ్వాసం నెగ్గిన నాటి నుంచి ఎవరికి చైర్మన్ పదవి దక్కుతుందోనని ఉత్కంఠ నెలకొంది. సామాజిక, రాజకీయ సమీకరణాలు చూస్తే తమకే సీటు కేటాయించాలని ఆశావహులు ఇప్పటికే ఎమ్మెల్యే చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

రేసులోని వారందరూ వైఎస్సార్‌సీపీ సభ్యులే

చీరాల మున్సిపల్ ఎన్నికలలో 33 వార్డుల్లో ఎక్కువ శాతం వైఎస్సార్‌సీపీకి చెందిన కౌన్సిలర్లు విజయం సాధించారు. టీడీపీ నుంచి ఒక్కరు మాత్రమే గెలుపొందారు. మాజీ ఎమ్మెల్యే ఆమంచి వర్గానికి 9 మంది ఉన్నారు. 2024లో ఎన్నికల అనంతరం వైఎస్సార్‌సీపీకి చెందిన కౌన్సిలర్లు కూటమికి మద్దతు పలికారు. చైర్మన్‌పై అవిశ్వాసం ప్రకటించిన తర్వాత ఆ పదవికి పోటీపడుతున్న వారందరూ మొన్నటి వరకు వైఎస్సార్‌సీపీలో ఉన్నవారే. అయితే టీడీపీ సింబల్‌పై గెలిచిన ఏకైక కౌన్సిలర్ కె.యానాదిరావు రేసులో లేకపోవడంతో వైఎస్సార్‌సీపీని వీడి కూటమికి మద్దతు పలికిన కౌన్సిలర్లకే అవకాశం ఉంది. రేసులో ఉన్న వారంతా మిగిలిన కౌన్సిలర్లను అన్నివిధాలా 'మంచి' చేసుకోవాల్సి పరిస్థితి నెలకొంది.

బరిలో ప్రధానంగా నలుగురు

ఎనిమిది నెలల పదవీకాలం ఉన్న మున్సిపల్ పాలక వర్గానికి తమనే చైర్మన్‌గా చేయాలంటూ ఇప్పటికే ఎమ్మెల్యే ముందు నలుగురు ప్రతిపాదనలు ఉంచారు. ప్రాధాన్యత క్రమంలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య సామాజికవర్గానికి చెందిన మించాల సాంబశివరావు, సీనియార్టీ ప్రకారం తనకే ఇవ్వాలని పొత్తూరి సుబ్బయ్య, గౌడ సామాజికవర్గానికి చెందిన సూరగాని లక్ష్మి, చేనేత సామాజికవర్గానికి చెందిన గోలి స్వాతి పోటీ పడుతున్నారు. ఎమ్మెల్యే మాత్రం ఈ విషయంలో అనేక రాజకీయ, సామాజిక సమీకరణలతో ముందుకెళ్లాలనే ఆలోచనలో ఉన్నారు.

సంబరం .. ఇంద్ర వైభవం

నయన మనోహరంగా దుర్గమ్మకు శాకంబరి అలంకారం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. శాకంబరి ఉత్సవాలు మూడు రోజులపాటు వైభవంగా కొనసాగాయి. పూర్ణాహుతితో ఈ ఉత్సవాలు పరిసమాప్తమయ్యాయి. శాకంబరీదేవి అలంకారంలో కొలువైన దుర్గమ్మను దర్శించుకునేందుకు గురువారం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఉత్సవాల్లో భాగంగా దుర్గమ్మను నయన మనోహరంగా వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు.



ఉత్సవాలు పరిసమాప్తం

శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో మూడు రోజులపాటు జరిగిన శాకంబరి ఉత్సవాలు పూర్ణాహుతితో పరిసమాప్తమయ్యాయి. ఆలయ ప్రాంగణంలోని నూతన యాగశాలలో గురువారం ఉదయం ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యుల పర్యవేక్షణలో అర్చకులు, వేద పండితులు పూర్ణాహుతి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ ఈవో శీనానాయక్ దంపతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తన పుట్టిన రోజును పురస్కరించుకుని ఈఓ అన్నదానం పథకానికి రూ. 50 వేల విరాళం సమర్పించారు. ఉత్సవాలలో మూడో రోజున అమ్మవారి మూల విరాట్‌ను వివిధ ఫలాలు, డ్రైఫ్రూట్స్‌తో అలంకరించారు. ఆలయాన్ని బత్తాయి, దానిమ్మ, పైనాపిల్, పచ్చి ఖర్జూరం, ఆల్‌బక్రా, యాపిల్, పుచ్చకాయలు, పలు రకాల ద్రాక్షలతో అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలి వచ్చారు. మూడు రోజుల ఉత్సవాల్లో 36 టన్నులకు పైగా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లను వినియోగించినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

అమ్మ సన్నిధిలో గురుపూజా మహోత్సవం

వ్యాస పౌర్ణమిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో గురు పూజా మహోత్సవాన్ని నిర్వహించారు. దేవస్థానానికి చెందిన తంగిరాల వెంకటేశద్వర ఘనాపాటి, శంకరమంచి శివప్రసాద్, అహితాగ్ని గుంటూరు రామచంద్ర సోమయాజులు దంపతులను సత్కరించి పట్టువస్త్రాలు, అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ ఈఓ శీనానాయక్ దంపతులు గురువులకు హారతులిచ్చి పూజ నిర్వహించారు. నగదు బహుమతి ఇచ్చి సత్కరించారు.

విద్యారంగ పరిరక్షణపై ప్రత్యేక దృష్టి


రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె: విద్యారంగ పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోనే తొలిసారిగా అందరినీ ఆత్మీయంగా కలిపే కార్యక్రమం ఇదని, రాష్ట్ర విద్యా వ్యవస్థలో కొత్త ఒరవడిని సృష్టిస్తోందన్నారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం కలిసి పనిచేసే సంస్కృతిని పెంచడమే కార్యక్రమ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు మెగా డీఎస్సీని విజయవంతంగా పూర్తి చేశామన్నారు. గత ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేసిందని, ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ కూడా వేయలేదన్నారు. 'ఒక క్లాసుకు ఒక టీచర్' విధానంలో 9,600 మోడల్ ప్రైమరీ స్కూళ్లు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులకు మొక్కలు అందించారు. ఆర్డీవో రామలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, కమిషనర్ సాంబశివరావు, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, నాయకులు పంతాని మురళీధరరావు, మేకా రామకృష్ణ, స్కూల్ హెచ్ఎం సీహెచ్ సుందరరావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనగాని సత్యప్రసాద్

శాకంబరిగా బాల చాముండేశ్వరి



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతి బాల చాముండికా సమేత అమరేశ్వర స్వామి వారి దేవస్థానంలో గురువారం బాల చాముండేశ్వరి దేవి భక్తులకు శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆషాఢ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారిని కూరగాయలతో ఆకర్షణీయంగా అలంకరించారు. లోక కల్యాణార్థం అమ్మవారిని కూరగాయలతో అలంకరించామని ఆలయ స్థానాచార్యుడు చంద్రశేఖర శర్మ తెలిపారు. ఆలయంలోని జ్వాలాముఖి దేవికి కూడా శాకంబరిగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మ వారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు.



పసుపు ధరలు
(గురువారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 743

కొమ్ములు : 541 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,100	10,725	10,100

(ధర రూ॥ల్లో)

కాయలు : 202 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,100	10,100	10,100

మొత్తం అమ్మకాలు : 557.250 క్వింటాళ్లు

–దుగ్గిరాల

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 1,000 గరిష్టం : రూ. 1,600

మోడల్ ధర రూ. 1,200

మిర్చి యార్డు సమాచారం
(గురువారం ధరలు)



వచ్చిన బస్తాలు	41,480
అమ్మకాలు	44,205
నిల్వ	7,114

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500–12,800
నంబరు-5	10,000–13,300
341	10,000–13,400

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500–12,800
నంబరు-5	10,000–13,200
273	9,800–12,400
341	10,000–13,500
4884	10,000–12,600

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 13,500
బాడిగ-355	10,000 – 12,600
దేవనూరు డీలక్స్	10,000 – 12,400
ఆర్మూర్	9,600 – 11,200
తాలుకాయలు	5,000 – 6,800

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000–13,400
బాడిగ – 355	10,000–12,500
తాలు	5,200 – 7,000

–కొరిటిపాడు (గుంటూరు)

రెడ్‌బుక్ రాజ్యాంగంపై ఆత్మస్థైర్యంతో పోరాటం

- వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు
- కొల్లూరులో విస్తృతస్థాయి సమావేశం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు

కొల్లూరు: అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలుచేయకుండా ప్రజలను నట్టేట ముంచుతుందని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు మండిపడ్డారు. కొల్లూరు గాంధీనగర్ వద్ద పార్టీ మండల కన్వీనర్ సుగ్గున మల్లేశ్వర రావు అధ్యక్షతన గురువారం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. అశోక్‌బాబు మాట్లాడుతూ కూటమి నేతలు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ గ్రామాలలో విష సంస్కృతిని అలవాటు చేయడం దురదృష్టకరమని ఖండించారు. రెడ్‌బుక్ రాజ్యాంగానికి కార్యకర్తలు భయపడకుండా కలసికట్టుగా ఉంటూ ఆత్మస్థైర్యంతో ప్రజాసమస్యలపై పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వ ఆదేశాలతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను అణచివేసేందుకు పోలీసులు అత్యుత్సాహం చూపుతున్నారని, తప్పుడు కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురిచేస్తే వారిపైనా ప్రైవేటు కేసులు పెట్టేందుకు సిద్ధమని హెచ్చరించారు. చంద్రబాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు మోసాలను నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించాలని అన్నారు. క్యూఆర్ కోడ్‌ను వినియోగించే విధానంపై నాయకులు, కార్యకర్తలకు ఆయన వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు చొప్పర సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యులు బుల్లా నవరత్నం, బావిరెడ్డి వెంకట్రామయ్య, గుంటూరు రామారావు, కోఆప్షన్ సభ్యుడు షేక్ బాజి, సర్పంచ్‌లు మంచాల వసుంధర, గుర్రం మురళి మేకతోటి శ్రీకాంత్, మాజీ ఎంపీపీ పెరికల పద్మారావు, మాజీ సర్పంచి కట్టుపల్లి సోమయ్య, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండలస్థాయి వివిధ విభాగాల నాయకులు కోగంటి లవకుమార్, బిట్రగుంట సత్యనారాయణ, పెరికల పద్మారావు, జోషి బాబు, సుధారాణి, గుర్రం వీరరాఘవయ్య, సిరాజుద్దీన్, చలంచర్ల కనకదుర్గ, దివి వెంకటేశ్వరరావు, హుసేన్, నాంచారయ్య, సురేష్, కనపర్తి మోహన్‌రావు, గుంటూరు పవన్‌కుమార్, శివన్నారాయణ, గరిక రమేష్, రామ్మోహన్ పాల్గొన్నారు.

బాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గాదె మధుసూదనరెడ్డి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి గాదె మధుసూదనరెడ్డి

పర్చూరు(చినగంజాం): అమలుకు నోచుకోని హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్న చంద్రబాబు మోసాలను ఇంటింటికీ వెళ్లి విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గాదె మధుసూదనరెడ్డి తెలిపారు. స్థానిక అద్దంకి నాంచారమ్మ ఫంక్షన్ హాలులో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ సమాయత్త సభ పార్టీ మండల అధ్యక్షుడు కఠారి అప్పారావు అధ్యక్షతన నిర్వహించారు. గాదె మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని, కరోనా కష్టకాలంలో ఆర్థికంగా ఇబ్బందులు పడినప్పటికీ రాష్ట్రంలో చక్కటి పాలన అందించారని, సంక్షేమ పథకాలను అవాంతరం లేకుండా చేశాన్నారు. చంద్ర బాబు సూపర్ సిక్స్ హామీలు పూర్తిగా నెరవేర్చలేకపోయారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా తమ నాయకుడు జగన్‌మోహనరెడ్డిని దూషించటమే ధ్యేయంగా పెట్టుకన్నారని ..ఇటువంటి నాయకుడు మనకు అవసరమా ? అని దుయ్యబట్టారు. ప్రతి ఇంటికీ వెళ్లి కోడ్‌ను ఆయా కుటుంబాలకు చెందిన సెల్‌ఫోన్‌లలో స్కాన్ చేయించి అందులో వచ్చే చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టో, ఇతర వాగ్దానాలు, హామీలు, సూపర్ సిక్స్ పథకాలు గురించి ప్రజలకు వివరించాలని మధుసూదనరెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా అధికార ప్రతినిధి బండారు ప్రభాకరరావు, వైస్ ఎంపీపీ పాలేరు వీరయ్య, జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్, బూత్ కమిటీ అధ్యక్షుడు ముప్పాళ్ళ రాఘవయ్య, కోట శ్రీనివాసరావు,తులసీ నాగమణి, గోరంట్ల శివకుమారి, యూత్ అధ్యక్షుడు కొల్లా శేషగిరి, మల్లా శ్రీను, ప్రచార కమిటీ అధ్యక్షుడు దాసరి వెంకటరావు, మల్లిశెట్టి జగన్నాథం, యద్దనపూడి హరిప్రసాద్, కంచనపల్లి రమేష్, గాదె సురేష్, ఇంకొల్లు మండల కన్వీనర్ చిన్ని పూర్ణారావు పాల్గొన్నారు.

తుల్జాభవానీ దేవాలయ పునర్నిర్మాణానికి కార్యాచరణ



పుట్లగూడెం అడవిలో సర్వే నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు

అచ్చంపేట: మండలంలోని పుట్లగూడెం నుంచి బెల్లంకొండ మండలం వెంకటాయపాలెం వరకు అడవిలోనుంచి నాలుగున్నర మీటర్ల వెడల్పుగల రోడ్డు, ఇటీవల కూల్చివేతకు గురైన తుల్జాభవానీ దేవాలయ పునర్నిర్మాణాలకు అటవీ శాఖాధికారులు గురువారం కార్యాచరణ ప్రారంభించారు. వీటి సాధనకోసం తాము ఢిల్లీ వరకు వెళ్లి ఫారెస్ట్ కన్జర్వేటివ్ అధికారులతో జరిపిన చర్చలు సఫలమయ్యాయని అఖిలభారత గిరిజన వికాస పరిషత్ అధ్యక్షుడు భూక్యా తులసీనాయక్ (బీటీ నాయక్), కార్యదర్శి భూక్యా రమేష్ నాయకులు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బ్రిటిష్ కాలంలో ఉన్న నాలుగున్నర మీటర్ల వెడల్పుగల రోడ్డు నిర్మాణానికి, అడవి మధ్యలో ఉన్న తమ ఆరాధ్య దేవత తుల్జా భవానీ అమ్మవారి దేవాలయ నిర్మాణానికి కావలసిన భూమి కేటాయింపునకు అధికారులు సర్వే నిర్వహించారన్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే అచ్చంపేట, బెల్లంకొండ మండలాల మధ్య దూరం తగ్గి రాకపోకలకు అనువుగా ఉంటుందని తెలిపారు. ఫారెస్ట్ అధికారులు పాత రికార్డులు, శాటిలైట్ పిక్చర్స్ పరిశీలించి బాట ఉన్న విషయాన్ని రూఢీ చేసుకున్నారన్నారు. అదేవిధంగా అమ్మవారి దేవాలయానికి అనువైన స్థలం కోసం అన్వేషించారన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మెస్సర్స్ మరోని ఇన్‌ఫ్రా సంస్థ మేనేజర్ జి.బాలాజీ, సివిల్ ఇంజినీర్ డి.నాగరాజు, నరసరావుపేట ఫారెస్ట్ రేంజర్ అధికారి అడవిలో అనువైన స్థలాలను పరిశీలించారన్నారు. దేవాలయ కమిటీ సభ్యులు, వెంకటాయపాలెం సర్పంచ్ భూక్యా నాగమ్మ, మాజీ సర్పంచ్ మేళం శ్రీరామమూర్తి, హన్మంత్ నాయక్, ఆర్యవైశ్య నాయకులు దేవరశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్లలో పూడికతీత పనులు ప్రారంభం



సాక్షి ఎఫెక్ట్

రేపల్లె: ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నా డ్రెయిన్లలో పూడిక తీయించకపోవడంపై గత వారం సాక్షిలో ''ముంపు ముప్పు'' అనే శీర్షికన నియోజవర్గంలోని ప్రధాన మురుగు కాలవలు గుర్రప్పు డెక్క, తూటి కాడతో పూడి పోవడంతో పంటకు నష్టం జరిగే ప్రమాదాన్ని వివరిస్తూ కథనాన్ని ప్రచురించింది. దీంతో స్పందించిన అధికారులు పూడిక తీత పనులకు శ్రీకారం చుట్టారు. ప్రధానంగా వాడ మురుగు, ఆర్‌ఎం డ్రెయిన్లలో గుర్రప్పు డెక్క, తూటి కాడలను తీయిస్తున్నారు. దీనిపై నియోజకవర్గంలోని రైతులు హర్షం వ్యక్తం చేస్తూ, సాక్షికి కృతజ్ఞతలు తెలియజేశారు.

పాత జాతీయ రహదారిపై కారు బీభత్సం

వీఆర్వోతో పాటు మరో నలుగురికి గాయాలు



తుక్కుతుక్కు అయిన వీఆర్వో ద్విచక్ర వాహనం

తాడేపల్లి రూరల్ : మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ పాత జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళా వీఆర్వోతో పాటు మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని వైద్యం నిమిత్తం వేర్వేరు ఆసుపత్రులకు తరలించారు. సేకరించిన వివరాల ప్రకారం.. మంగళగిరి నుంచి ప్రకాశం బ్యారేజ్ వైపు అతి వేగంగా వెళుతున్న కారు పాత జాతీయ రహదారిపై ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ దగ్గర ఎదురుగా వస్తున్న నాలుగు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టింది. తొలుత పెదకాకాని నుంచి బదిలీ అయి ఇప్పటం వీఆర్వోగా విధులకు హాజరయ్యేందుకు నులకపేటలోని తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయానికి వస్తున్న జయంతి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఐదు అడుగులు పైకి లేచి రోడ్డుపై పడింది. ఈ ఘటనలో ఆమెకు కుడి కాలు మోకాలి వద్ద విరిగిపోయింది. వీఆర్వో ద్విచక్ర వాహనం అనంతరం కారు మరో రెండు వాహనాలను ఢీకొంది. ఇందులో ఇద్దరు పురుషులు, మహిళ, చిన్నారికి స్వల్ప గాయాలయ్యాయి. వీఆర్వోను 108 వాహనంలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మిగిలిన నలుగురిని స్థానిక ఆసుపత్రికి తరలించి వైద్యం చేయిస్తున్నారు. నాలుగు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టిన కారు అతి వేగంగా ఉండవల్లి సెంటర్ వైపు వెళ్లడంతో యువకులు ఆపేందుకు ప్రయత్నించారు. డ్రైవర్ వారి వాహనాలను సైతం ఢీకొట్టేందుకు ప్రయత్నించాడు. ఈ సంఘటనపై తాడేపల్లి తహసీల్దార్ సీతారామయ్య, ఆర్‌ఐ వేదాంతం వివరాలు సేకరిస్తున్నారు.

హోంగార్డు కుటుంబానికి రూ.5లక్షలు సాయం



హోంగార్డు కుటుంబానికి చెక్కు అందజేస్తున్న అదనపు ఎస్పీ జేవీ సంతోష్

నరసరావుపేట రూరల్: అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు కుటుంబానికి తోటి హోంగార్డులు అండగా నిలిచారు. మృతుని కుటుంబానికి ఒక రోజు వేతన మొత్తం రూ.5 లక్షలను సాయంగా అందించారు. తెనాలి రూరల్ పీఎస్‌లో విధులు నిర్వహిస్తూ హోంగార్డు వై.శ్రీనివాస్ ఈ ఏడాది ఫిబ్రవరి 18వ తేదీన గుండెపోటుతో మృతిచెందాడు. హోంగార్డు కుటుంబానికి అండగా నిలిచేందుకు తోటి హోంగార్డులు ముందుకు వచ్చారు. ఒక రోజు వేతనాన్ని సాయంగా అందించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ కార్యాలయంలో గురువారం జిల్లా అదనపు ఎస్పీ జేవీ సంతోష్ చేతుల మీదగా శ్రీనివాస్ కుటుంబసభ్యులకు సాయం చెక్‌ను అందజేశారు. హోంగార్డు కుటుంబానికి సాయం చేసేందుకు ముందుకు వచ్చని జిల్లా హోంగార్డులను అదనపు ఎస్పీ అభినందించారు. హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ గుండెపోటు కారణంగా ఉద్యోగ విరమణ చేసిన బండ్లమోటు పీఎస్ హోంగార్డు ఎ.నాసరయ్యకు రూ.5 లక్షల చెక్‌ను అదనపు ఎస్పీ సంతోష్ అందించారు. కార్యక్రమంలో హోంగార్డు ఆర్‌ఐ ఎస్.కృష్ణ పాల్గొన్నారు.

సమష్టి కృషితో డిపో అభివృద్ధి



చీరాల అర్బన్: ఉద్యోగుల సమష్టి కృషితోనే డిపో అభివృద్ధి సాధ్యమవుతుందని బాపట్ల డీపీటీఓ సామ్రాజ్యం అన్నారు. గురువారం చీరాల ఆర్టీసీ డిపో, బస్టాండ్, గ్యారేజీలను ఆమె పరిశీలించారు. బస్సులను పూర్తి కండిషన్‌లో ఉంచి ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం బస్టాండ్‌లోని పలు విభాగాలను ఆమె పరిశీలించారు. బస్టాండ్ పరిసరాలు, మరుగుదొడ్లు, స్టాల్స్‌ను పరిశీలించారు. తాగునీటి వసతి ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం యూనియన్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఓఆర్ పెంచేందుకు సిబ్బంది కృషి చేయాలని కోరారు. రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ, బస్సుల సమయపాలన పాటిస్తూ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలను కల్పించాలని సూచించారు. డిపో మేనేజర్ జంజనం శ్యామల, సిబ్బంది ఉన్నారు.

ముగ్గురు పేకాట జూదరుల అరెస్ట్

కారంచేడు: పేకాడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ షేక్ ఖాదర్‌బాషా తెలిపారు. గురువారం సాయంత్రం మండలంలోని కుంకలమర్రు గ్రామంలో పేకాడుతున్నట్లు వచ్చిన సమాచారంతో సిబ్బందితో దాడి చేశామన్నారు. అక్కడ పేకాడుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.3060 స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తామని తెలిపారు.

వ్యాసాయ.. విష్ణురూపాయ!



వేదవ్యాస సనాతన ధర్మక్షేత్రంలో మాట్లాడుతున్న భవఘ్ని గురూజీ



వ్యాస భగవానునికి పూజలు చేస్తున్న భవఘ్ని గురూజీ

వైకుంఠపురం భవఘ్ని ఆరామంలో ఘనంగా గురుపూర్ణిమ

అమరావతి: సాక్షాత్తు శ్రీమహావిష్ణువే ప్రపంచాన్ని సన్మార్గంలో నడిపించి అందరికీ మార్గదర్శకంగా నిలిచే గురువుగా, వేదవ్యాసుడిగా అవతరించాడని భవఘ్ని గురూజీ అన్నారు. మండల పరిధిలోని వైకుంఠపురం భవఘ్ని ఆరామంలోని వేదవ్యాస సనాతన ధర్మక్షేత్రంలో గురుపూర్ణిమ వేడుకలలో చివరి రోజున వ్యాస ఆరాధన ఘనంగా నిర్వహించారు. భవఘ్ని గురూజీ మాట్లాడుతూ వేద వ్యాసుడు నాలుగువేదాలు, అష్టా దశ పురాణాలతో పాటుగా మహాభారతాన్ని మానవాళికి అందించాడన్నారు. మానవుడిని సన్మార్గంలో నడిపించి, అధ్యాత్మిక జ్ఞానసంపదను అందించిన గురువులను స్మరించుకోవటం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. ఈ సందర్భంగా ఆది గురువు వ్యాస భగవానునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదవ్యాస భగవానుని ఆశీర్వచనం అందరికీ అందించారు. వేడుకల్లో భక్తులు భారీసంఖ్యలో పాల్గొన్నారు.

సాయిబాబా మందిరంలో...

పవిత్ర పుణ్యక్షేత్రమైన అమరావతి శ్రీ షిర్డీసాయి – పర్తిసాయి కపోతేశ్వర ధ్యాన మందిరంలో గురుపూర్ణిమ వేడుకలను గురువారం అత్యంత ఘనంగా నిర్వహించారు. వేకువజామునే బాబావారికి సుప్రభాతసేవ, నగర సంకీర్తన, షిర్డీ హారతి కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. తర్వాత బాబా విగ్రహానికి పంచామృతాలతో మహాభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకారం చేసి పూజలు నిర్వహించారు. అనంతరం దత్తాత్రేయ, షిర్డీబాబా, సత్యసాయిబాబా చిత్రపటాలకు, బాబావారి పాదుకలకు భక్తులతో పూజలు చేయించారు. చివరగా అన్నదానం నిర్వహించారు..

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

వివరాలు వెల్లడించిన డీఎస్పీ జగదీష్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

గురజాల: అంతర్రాష్ట్ర చైన్ స్నాచర్‌ను అరెస్టు చేసినట్లు గురజాల డీఎస్పీ బి.జగదీష్ తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది ఏప్రిల్ 3వ తేదీన మంచికల్లు గ్రామానికి చెందిన బొల్లెద్దుల కోటేశ్వరరావు దంపతులు గురజాల బైపాస్ మీదుగా దాచేపల్లికి వెళ్తుండగా మార్గం మధ్యలో జగనన్న కాలనీ వద్ద మహిళ మెడలోని నానుతాడు అపహరణకు గురైందన్నారు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో దంపతులు ఫిర్యాదు చేశారన్నారు. సీఐ ఆవుల భాస్కర్ టీంను ఏర్పాటు చేసి విచారణ సాగించారని, పలు సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలించగా విచారణలో నిందితుడు తెలంగాణ రాష్ట్రం, సూర్యపేట జిల్లా, కోదాడ మండలం బాలాజీ నగర్ తండాకు చెందిన బర్మవత్ నాగరాజుగా గుర్తించామని చెప్పారు. అతడిని విచారించగా చైన్ స్నాచింగ్‌ను ఒప్పుకున్నట్లు తెలిపారు. అతని వద్ద రూ.10 లక్షలు విలువ కలిగిన 92 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నాగరాజు డీజే ఆపరేటర్‌గా పనిచేస్తూ చెడు వ్యసనాలకు అలవాటు పడి దొంగతనాలు చేస్తు జీవనం సాగిస్తుంటాడన్నారు. అతను ఫిబ్రవరి నెల 16వ తేదీన నరసరావుపేట సత్తెనపల్లి మధ్య మాదాల గ్రామం వద్ద టీవీఎస్‌పై భర్తతో కలిసి వెళ్తున్న మహిళ మెడలోని బంగారు గొలుసును, 19వ తేదీన పిడుగురాళ్ల మండలం శ్రీనివాసపురం వద్ద ఓ మహిళ మెడలో చైన్ లాక్కొని వెళ్లి పోయినట్లు విచారణలో ఒప్పుకున్నట్లు తెలిపారు. నందిగామ, గండేపల్లి, వత్సవాయి, చిల్లకల్లు, తెనాలి త్రీ టౌన్, పెనుగంచిప్రోలు పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు సంబంధించి పలు కేసులు ఇతనిపై ఉన్నాయన్నారు. కేసును ఛేదించిన సీఐ ఆవుల భాస్కర్, ఎస్‌ఐ వై.వినోద్ కుమార్, బి.అనంత కృష్ణ, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

రేపు వాటర్ పోలో జట్ల ఎంపికలు

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలోని స్విమ్మింగ్ పూల్‌లో సబ్ జూనియర్స్, జూనియర్స్ జిల్లా వాటర్ పోలో జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి వై.వి.సుబ్బారెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 19, 20 తేదీలలో విశాఖపట్నం బీచ్‌రోడ్డులోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించనున్న 10వ అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్ పోటీలలో పల్నాడు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ పేర్లను ఈనెల 11వ తేదీ సాయంత్రం 5గంటల లోపు స్విమ్మింగ్ పూల్ కార్యాలయంలో ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలతో నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు.

నెలాఖరులోగా పనులు పూర్తి చేస్తాం

ఎన్నెస్పీ డీఈ విజయలక్ష్మి

శావల్యాపురం: మండలంలోని గంటావారిపాలెం అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలో మేజరు కాల్వ అభివృద్ధి పనులు ఈనెలాఖరులోగా పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టినట్లు లింగంగుంట్ల ఎన్నెస్పీ డీఈ జరుగుల విజయలక్ష్మి చెప్పారు. పోట్లూరు గ్రామానికి చెందిన లింగా రత్తమ్మ తన పొలానికి సాగునీరు ఇవ్వడం లేదని జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేయగా గురువారం క్షేత్రస్థాయిలో విచారణ నిమిత్తం మేజరు కాల్వను పరిశీలించారు. డీఈ మాట్లాడుతూ శ్రీశైలం, నాగార్జునసాగర్ జలశయాలకు పూర్తిస్థాయిలో నీటి సామర్థ్యం పెరుగుతుందని, ఉన్నతాధికారుల సమావేశం అనంతరం ఎబీసీ కెనాల్‌కు సాగునీరు విడుదల చేయటానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఏబీసీ కెనాల్ పరిధిలోని మేజరు కాల్వల్లో రూ.60 లక్షల వ్యయంతో జరుగుతున్న అభివృద్ధి పనులను నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించి విధివిధానాలు అధికారులకు సూచనలు చేస్తున్నట్లు తెలిపారు. పోట్లూరు మేజరు కాల్వ పరిధిలో నూతన సైఫన్ నిర్మాణ పనులకు రూ.30లక్షల నిధులు అంచనాలు వేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు తెలిపారు. వీఆర్వో నరసింగరావు, ఎన్నెస్పీ ఏఈ పోట్లూరు లక్ష్మీనారాయణ రైతులు ఉన్నారు.

నీటిగుంతలో పడి వ్యక్తి మృతి

వినుకొండ: వినుకొండ రూరల్ మండలం, గోకనకొండ గ్రామానికి చెందిన పాలపర్తి ఆంజనేయులు(45) ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి మృతిచెందాడు. ఈనెల 8వ తేదీన గ్రామ సమీపంలో బహిర్భూమికని వెళ్లి గ్రామ శివారులో గల పొలంలో ఉన్న నీటి కుంటలో పడి మృతిచెందాడు. మరుసటి రోజు ఉదయాన్నే బంధువులు వెతుక్కుంటూ నీటి కుంట వద్దకు వెళ్లి చూడగా శవమై తేలియాడుతున్నట్లు సమాచారం. మృతునికి భార్య ఏగేశ్వరమ్మ, కుమారుడు అనిల్, కుమార్తె అఖిల ఉన్నారు. వినుకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతు సంఘం నేతపై టీడీపీ నాయకుల దాడి

క్రోసూరు అమరావతి బస్టాండ్ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో



మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం సభ్యుడు తిమ్మిశెట్టి హనుమంతరావు

క్రోసూరు: కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని సీజీజీబీ బ్యాంకులో గోల్డ్ బాధితులకు అండగా నిలిచి పోరాడుతున్న రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు తిమ్మిశెట్టి హనుమంతరావుపై దొడ్లేరు గ్రామానికి చెందిన టీడీపీ మండల అధ్యక్షుడు మొగల్‌జాను, అతని తమ్ముడు సమీర్ దాడిచేశారని బాధితుడితో కలిసి సీపీఎం నేతలు గురువారం క్రోసూరులోని అమరావతి బస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో చేపట్టారు. ఈ విషయమై బాధితుడు తిమ్మిశెట్టి మాట్లాడుతూ తాను దొడ్లేరు గ్రామం వెళ్తుండగా, టీడీపీ మండల అధ్యక్షుడు మొగల్‌జాను, అతని తమ్ముడు దారికాచి దుర్భాషలాడుతూ నీకు ఇక్కడేం పని.. దొడ్లేరు ఎందుకొస్తున్నావంటూ దాడిచేసి కొట్టారని తెలిపాడు. గతంలో సాగు నీరు విషయమై కూడా దౌర్జన్యం చేశారని తెలిపారు. తనపై దాడి చేసిన వారిపై ఎఫ్‌ఐఆర్ కట్టి వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కలిసి డిమాండ్ చేస్తూ సీపీఎం నేతలతో కలిసి రాస్తారోకో చేశారు. ఆందోళనకారులతో సీఐ సురేష్, ఎస్‌ఐ రవిబాబు మాట్లాడి విరమింపజేశారు.

మ్యూజియాల్లో కార్మికులను కొనసాగించాలి

అమరావతి: రాష్ట్రంలోని అమరావతి సర్కిల్ పరిధిలోగల ఏఎస్‌ఐ మ్యూజియాల్లో క్యాజువల్ లేబర్‌గా విధులు నిర్వర్తిస్తున్న 150 మందిని కొనసాగించాలని, గురువారం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించామని అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు తెలిపారు. ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి మహా చైత్యం, నాగార్జునకొండ మహాచైత్యం, గండికోట, లేపాక్షి, చంద్రగిరి పోర్ట్, శాలిగుండం, భట్టిప్రోలు, శంకరం ఏఎస్‌ఐ మ్యూజియాల్లో 10,15 సంవత్సరాలుగా పని చేస్తున్న క్యాజువల్ కార్మికులను ఉత్తర్వులు లేకుండా విధులకు హాజరు కావద్దని మౌఖిక ఆదేశాలు జారీ చేయటం దారుణమన్నారు. గతంలో ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలనే నివేదిక ప్రస్తుతం డైరెక్టర్ జనరల్ ఆఫీస్‌లో చాలాకాలంగా పెండింగ్‌లో ఉందన్నారు. ఆయన వెంట ఉద్యోగుల ప్రతినిధులు గడ్డం అమృత్ కుమార్, తెలగంశెట్టి చూడామణి, కందుల రమేష్ ఉన్నారు

12న ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం

తెనాలి: జిల్లాలోని తాడేపల్లిలో గల సీఎస్‌ఆర్ కల్యాణ మండపంలో ఈనెల 12వ తేదీన ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి సమావేశం జరుగుతుందని గుంటూరు జిల్లా మాదిగ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు చెట్టిపోగు లక్ష్మణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు, ఎస్సీ వర్గీకరణ విజేత మందా కృష్ణమాదిగ పాల్గొంటారని తెలిపారు. ఇదే వేదికపై కృష్ణమాదిగ దంపతులకు ఘన సత్కారం ఉంటుందని, జిల్లాలోని మాదిగ ఉద్యోగులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.